Namasthe Telangana Dt 19/07/16.

# ఫుట్‌పాత్‌లకు కొత్త లుక్..!

**అభివృద్ధికి నోచుకుంటున్న పాదచారుల రోడ్లు**

**టైల్స్ వేసి అందంగా ముస్తాబు..**

**చకచకా సాగుతున్న పనులు**



సోమాజిగూడ విద్యుత్ సౌధ రోడ్డులో కొనసాగుతున్న ఫుట్‌పాత్‌ల నిర్మాణం

ఖైరతాబాద్, జూలై 17 : నగర జనభా కోటికి చేరువు తోంది. ట్రాఫిక్ పెరిగిపోతోంది. రహదారులపై కనీసం నడిచేందుకు కూడా ఇబ్బందులుగా ఉంటున్నాయి. చాలా చోట్ల ఫుట్‌పాత్‌లు దెబ్బతినడం వల్ల పిల్లలు, వృద్ధులు గాయాలపాలవుతున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో ఆక్రమణలకు గురికావడంతో పాదాచారులు ఇబ్బందులు పడుతున్నారు. నగరంలోని ప్రధాన రహదారిగా చెప్పుకునే ఖైరతాబాద్-పంజాగుట్ట రోడ్డుపై ప్రయాణించాలంటే అర చేతిలో ప్రాణాలు పెట్టుకోవాల్సిందే. గత రెండేళ్ల కిత్రం మెట్రో పనులు కొనసాగుతున్న తరుణంలో పెద్ద పెద్ద సిమెంట్ దిమ్మెలతో పాటు తాత్కాలిక షెడ్లను రోడ్డు మధ్యలో ఏర్పాటు చేశారు. దీంతో రహదారి చిన్నగా మారి నిత్యం ట్రాఫిక్ జామ్ అయ్యేది. ఈ క్రమంలో హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టు అధికారులు ఖైరతాబాద్ జంక్షన్ నుంచి కేసీపీ జంక్షన్ వరకు రోడ్లకు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లను తొలగించి వెడల్పు చేయించారు. ఫలితంగా వాకింగ్ ట్రాక్‌లు కన్పించకుండాపోయాయి. పాదచారులు రోడ్లపై నడుస్తూ పలుసార్లు ప్రమాదాల బారిన పడ్డాడు. ఖైరతాబాద్ చౌరస్తా నుంచి పంజాగుట్ట వరకు మెట్రో పిల్లర్ల పనులు దాదాపుగా పూర్తి కావడంతో తిరిగి ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేసేందుకు హెచ్ఎంఆర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

### రూ.17లక్షలతో పనులు

ఖైరతాబాద్ నుంచి కేసీపీ జంక్షన్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌ల ఏర్పాటు చేసే బాధ్యతను స్వయంగా హెచ్ఎంఆర్ తీసుకుంది. రూ.17లక్షలతో రెండువైపులా 400 మీటర్ల మేరకు ఫుట్‌పాత్‌లు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం కేసీపీ జంక్షన్ వరకు వేస్తుండగా, అక్కడి నుంచి లక్డీకాపూల్-ఖైరతాబాద్ జంక్షన్, అమీర్‌పేట,సనత్‌నగర్ వరకు ఇంకా మెట్రో పనులు కొనసాగుతుండటంతో అవి పూర్తయిన తర్వాత ఆయా ప్రాంతాల్లో సైతం ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేస్తామని హెచ్ఎంఆర్ అధికారులు చెబుతున్నారు.



ప్రెస్‌క్లబ్ ఎదుట ఫుట్‌పాత్‌ల నిర్మాణం కోసం జరుగుతున్న పనులు